1977 పింగళ సంవత్సర దీపావళి కథల పోటీలో రు. 116/- కన్సొలేషన్ బహుమతి పొందిన కథ


# పొగమంచు

## నవులూరి వెంకటేశ్వర రావు



## రాత్రంతా ఏడ్చాడా? కను రెప్పలు, మొహం ఉబ్బి వున్నాయి.

తన వైపు చూడటంలేదు. ఏదో తెలిసిపోతుందన్నట్లు సముద్రం కేసి చూస్తున్నాడు.



ఒక పేం కుర్చీలో దుర్గ కూర్చుంది. మరోదాంట్లో పురుషోత్తం.

ఇంతకు క్రితం సముద్రం అగుపించేట్లు ఈ రెండు కుర్చీలు వరండాలో వేసింది పనిమనిషి. దుర్గే వేయమంది చలిచలిగా వున్నా బయట కూర్చోవాలన్న కోరికతో. టవలుతో మొహం తుడుచుకుంటూ పురుషోత్తం వస్తున్నపుడు ఈ చలిలో ఎందుకు లోపలికి పద అంటాడనుకుంది. అది ఒక్కక్షణం పాటు. మరుక్షణంలోనే అతనట్లా అనడు అని తను అనుకున్నట్లే ఏమీ అనలేదు. అతని దగ్గరనించి ఇంక ఎలాంటి ఆంక్షలూ వుండవు. ఇక ఎన్ని రోజులు గనక.... నెలా? అప్పుడే నెలలో వారం రోజులు జారిపొయ్యాయి. ఇరవై.. పది.. అయిదు.. లేదూ, రేపటితోనే అంతా అయిపోవచ్చు.

సముద్రమంతా పొగమంచే. ఆకాశం నించి సముద్రం మీదికి తెర వేలాడదీసినట్టు. కలకాలం నిలచిపోవాలన్న ధృడ నిశ్చయంతో వున్నట్టు దట్టంగా సముద్రం, ఆకాశం కలసిన దృశ్యాన్ని రహస్యంగా వుంచదలచుకున్నట్లు.

"మీ కింకా రాత్రి బడలిక తీరలేదు కదూ" దుర్గ.

ఎన్నివందలమైళ్ళ ప్రయాణం. జీవితపు అంచుకి చేరినట్లు భూమి అంచుకి చేరారు. ఈ ఏర్పాటు చాలా వింతగా జరిగింది. శేషగిరిగారు ఉత్తర హిందూస్థానం ప్రయాణం పెట్టుకున్నట్లు తెలియడం — ఇద్దరూ కలిసి వుండే ఈ కొద్ది రోజులూ ఎక్కడన్నా గడుపుదామని కోరిక వెల్లడి చేయడం.

"నీకు నిద్ర బాగా పట్టిందా రాత్రి."

తనన్న దానికి ఇది సమాధానం కాదన్న విషయం గమనించింది. అతనికేసి తల తిప్పింది. నీలం, ఆకుపచ్చ గళ్ళ లుంగీ, ఒంటికి చొక్కాలేదు. చలి వెయ్యడం లేదేమో.

అబ్బా ఏం పొగ మంచు. ఇంతదట్టంగా పట్టిందేమి? ప్రహరీగోడకు రెండు మూడు గజాల దూరంలోవున్న ఇసక కూడ అగుపించడంలేదు. అవతల సముద్రం వుందని రొదన వల్ల అనుకోవాల్సిందే. వర్తమానానికి భవిష్యత్తుకి గోడలా. వర్తమానంతో జీవితానికి ఫుల్‌స్టాప్ పెడుతున్నట్లు. ఈ ప్రశాంతత తనకు బాగా లేదు. కానీ దుర్గ? దుర్గ మాట తోసిపుచ్చరానిది. వేయిమంది చేస్తున్న గొడవలో వుండాలని వుంది తనకు. మనసులో ఆలోచన లేక జ్ఞాపకం చోటు చేసుకోకుండా వుంటే బాగుండు.

"ఓహ్, చక్కగా పట్టింది. గుర్రు పెట్టానేమో కూడా. నిద్రపోని మీరే చెప్పాలి."

ఎందుకీ శల్యపరీక్ష చేస్తోంది. ఆమెకు తెలీదా తనకు నిద్రపట్టని విషయం. దానికి కారణం. ? తన నోటితో చెప్పాలేమో. తనున్న స్థితివల్ల వచ్చిన హింసాపూరిత మనస్తత్వమా?

"సీతాలూ, ఆ టీపాయ్ రెండు కప్పుల టీ పట్టుకురా.... సిగరెట్ పెట్టె కూడా." దుర్గ కేకేసింది లోపలకి.


"ఏవండీ, ఇక్కడ వాతావణం ఎంతో బాగుంది కదూ? ఇంత విశాలమయిన ఇంట్లో మనం కొంత కాలమయినా గడుపుతామని అనుకున్నామా? ఇరుకు గదులు, మురిక్కాలువ కంపులూ...." దుర్గ తనలో తను మాట్లాడుకుంటోందో తనతో మాట్లాడుతోందో అర్ధమవలేదు, అందుకే ఊఁకొట్టలేదు.

ఆమెకు ఈ వాతావరణం నచ్చటం సంతోషాన్ని కలిగించిందతనికి. తను శేషగిరికి ఋణపడి వున్నాడీ విషయంలో. తను వుత్తరం రాయడమేమిటి, రెండు రోజుల్లో సమాధానం రావడమేమిటి - జరిగిపోయాయి. నెల రోజులకు పైగా ఇల్లు నిరభ్యంతరంగా వాడుకోవచ్చు అన్నాడు. పిల్లాపిడక. కుటుంబమంతా తరలి ప్రయాణమై వెళ్ళిపోయారు. రాత్రే తామిద్దరూ దిగబడ్డారు. వరండాలో కునికిపాట్లు పడుతూ సీతాలు, దాని మొగుడూ వున్నారు. తమ రాకకై ఎదురు చూస్తూ. శేషగిరి అన్ని ఏర్పాట్లు చేసే వెళ్ళాడు.

టీపాయ్‌తెచ్చి రెండు కుర్చీల ముందూ వుంచింది సీతాలు. ఆ తర్వాత రెండు కప్పులతో టీ, సిగరెట్ పెట్టె, అగ్గి పెట్టె తెచ్చింది. అతనిలో చలనంలేదు.

పొగమంచులోకే చూస్తున్నాడు. సరిగ్గా పదేళ్ళక్రితం వర్షం, పొగమంచు.

కిటికీ తలుపులు తీసేసరికి సన్నటిజల్లు, ప్రియురాలు జల్లే ఎన్నెటిలా. చీకటిమయం కటికీలోనించి పాలులా చీకట్లోకి దొర్లిన



పుట్టింది ప్రకాశం జిల్లా దర్శిగుంట పేటల్, పెరిగింది విజయవాడలో. విద్యాభ్యాసం విజయవాడలోని ఎ. కె. టి. పి. ఎం. హైస్కూలు, ఎస్సారార్ & సి. వి. ఆర్. కాలేజీల్లో. విశాఖపట్నం పోర్టు ట్రస్టు స్టోర్సు విభాగంలో స్టెనోగా ఉద్యోగం. ఇంగ్లీషులో డిప్లోమా కోర్సు చదివాను. ఎకనమిక్సు ఎమ్మేకి చదువుతున్నాను. ఆరేళ్ళనించి కథలు రాస్తున్నాను. ఆంధ్రజ్యోతి తదితర పత్రికలు, విశాఖసాహితి—సంకలనాలలో సుమారు డజను కథలు వెలువడ్డాయి. విశాఖ సాహితి అందునా ముఖ్యంగా నా మిత్రుడు, పాటి రచయిత శ్రీ మల్లాప్రగడ రామారావు, నన్ను ప్రోత్సహించారు. గైడి మొపాసా, ఆల్బర్ట్ మొరావియాలంటే ఎంతో ఇష్టం. చదరంగం ఆడటం, పుస్తకాలు చదవటం, విశాఖ మెయిన్ రోడ్డులో తిరగడం—ప్రస్తుతానికి ఇష్టమైన అలవాట్లు. నవంబరు మాసంలో నా పెళ్ళి.

—నవులూరి వెంకటేశ్వరరావు

కాంతి కొద్ది దూరమే వెళ్ళగలిగింది. నిద్రకు వెలియై, తానొంటరియై, గదిలోపల వెలుగులో....తలుపు చప్పుడు. వెళ్ళి తీస్తే తులసి. నిలువెల్లా తడిసి. సెకండ్షో కెళుతున్నా స్నేహితురాలితో కలిసి అని చెప్పిందట ఇంట్లో. ఇంట్లో తమ వివాహం గురించి జరిగిన గొడవ గురించిచెప్పింది. ఇద్దరూ విడిపోకతప్పదు. ఆమె కంటి రెప్పచివరనించి రాలని ముత్యంకేసి చూస్తుండిపొయ్యాడు. ప్రపంచం శ్మశానంగా కనిపించింది. రేపనేదుందా? రేపా, ఈ రోజా తన ఊరికి ముహూర్తం. కిటికీ దగ్గర కెళ్ళి నిలుచుండిపొయ్యాడు. తన ఆత్మ లేకుండా తను బతకలేడు. ఆమె లేని తనను ఊహించుకోలేడు. వర్షంలో కే తడుస్తూ వెళ్ళిపోతుంటే చూస్తూ వుండిపొయ్యాడు.

పెదవుల మధ్య దుర్గ పెట్టిన సిగరెట్‌ని సరిగా వుంచుకుని ఆమె గీసిన అగ్గిపుల్లతోనే వెలిగించుకున్నాడు. దుర్గని తన శరీరంలో ఒక భాగంగానే భావించాడు ఈ పదేళ్ళు. శరీరంలో ఒక భాగం చనిపోతే ఆ రోగాన్ని ఏమనాలో?

"లేవండి. స్నానం చేసి అలా వెళ్ళొద్దాం."

"అలాగే."

లోపలికి పరిగెత్తింది దుర్గ. తనూ లోపలి కెళ్ళాడు స్నానం చెయ్యడానికి.

అర గంటలో తయారయి ఇల్లు వదులుతున్న సమయానికి సూర్యుడు పైకి బారెడు పాకేడు. పొగలేడు. చాలా నీలంగా వుంది సముద్రం. ఇంటిముందు సరాసరి నడిచి ఇంటికేసి తిరిగి చూశారు. రాతి కట్టడం. అందువల్లే ఇంత కాలమయినా నిలిచివుందేమో. కిటికీల ఇనుప కమ్మీలు తుప్పుపట్టి ఎర్రగా వున్నాయి. ఇంటి కెప్పటి కప్పుడు మరమ్మత్తులు చేయించుకోవాలి, రంగులు వేయించుకుంటూవుండాలి. శ్రమతోకూడిన పని. సముద్రం ముందుకు జరిగి వస్తుంటుంది క్యాన్సర్‌లా ఒడ్డును కొరుక్కుతింటూ. చాలా కాలం క్రితం ఈ ఇంటికి ముందు కొన్ని ఇళ్ళువుండేవట. అవన్నీ సముద్రం పాలయి పొయ్యాయి. ఎడారులలానే సముద్రాలకీ ఆకలెక్కువవుతోంది. మనిషి ఒంటరి జీవితానికి ప్రతీకలా చెదురుగా ఒకదానికొకటి దూరంగా ఇళ్ళు—ఒకడి ఆర్తనాదం ఇంకొకడికి వినపడకూడదన్నట్లు, ఒకడి ఆనందంలో ఇంకొకడికి చోటు లేదన్నట్లు.

తడి ఇసకలో అడుగులేస్తుంటే ఎవరో ప్రేమగా తడిపెదవులతో పాదాలని ముద్దు పెట్టుకుంటున్నట్లు స్పర్శ. సముద్రంలో దూరంగా జాలరి పడవలు. ఇంటికి రెండున్నర. మూడు ఫర్లాంగుల దూరాన జాలరి గుడిసెలున్నాయి. ఇంటిని మొదలుకుని సముద్రపు అంచుపొడుగునా ఒక అర డజను తెప్పలున్నాయి. అక్కడక్కడా వలలు ఆరబెట్టి వున్నాయి. గుడిసెలకు దూరంగా అగుపిస్తూ బంగళా వుంది. సముద్రపు అంచున తెల్లరంగు విదేశస్తులు నలుగురయిదుగురు ఈదుతూ, ఇసకలో దొర్లుతూ వున్నారు. వాళ్ళని చూస్తూ ఇసకలో కొంతసేపు కూర్చుని ఇంటికేసి బయలుదేరారు ఎండ ఎక్కువ కావడం వలన. ఇల్లు దగ్గరవుతున్నప్పుడు నడుం చుట్టు చెయ్యి వేసి నడిపించాడు దుర్గని.

యాభై గజాల దూరంలో ఇల్లుందనగా ఒక తెప్ప దగ్గర యాభై ఏళ్ళ జాలరి. నాలుగయిదేళ్ళ కుర్రాడు నిలబడి వున్నాడు. సముద్రంవైపు తెప్పను లాగుతున్నాడా వ్యక్తి. కుర్రాడు తదేకంగా చూస్తున్నాడు. ఇద్దరూ నడక ఆపి అక్కడ నిలబడ్డారు. "నువ్ పోరా ఎదవా" అంటూ వాడిని ఆ వ్యక్తి అదిలిస్తున్నాడు. వాడు కదలడం లేదు.

"సూడండి బాబు, పొద్దునే తయారవుతాడు నాతోపాటు. నిలబడి ఒడ్డునించి చూస్తుంటడు. సందేలకల్లా ఇక్కడ మల్లా తయ్యారు. ఇంట్లోనే వుండరా గుంట నా కొడకా అంటే ఇన్డు."

"నీ మనవడా"

"నా కొడుకే."

కాసేపు అతనితో మాట్లాడాడు పురు



షోత్తం. పేరు దాలయ్యట. ఎన్నిచేపలు రోజుకి పడేది. ఏ చేప ఎట్లా వుండేది. చేపలమీద ఎంత సంపాదిస్తున్నది వివరాలు అడుగుతుంటే చెప్పాడు. దుర్గ కుర్రాడిని ముద్దు ముద్దుగా పలకరిస్తోంది.

"మీ బాబుతో పోతావా నీవు కూడా?"

"మా బాబు రానీడు."

"నీ కెళ్ళాలనుందేట్రా గుంట నా కొడకా" నవ్వుతూ అడిగింది దుర్గ.

"పెద్దయ్యేదాకా వల్లకోమంటా డయ్య."

నల్లగా వున్నాడు వాడు. నడుం చుట్టూ దారం వుంది. శరీరంమీద మరో నూలు పోగులేదు. ఎత్తుకుని బుగ్గలు చిదిమి దించింది వాడ్ని.

ఇంటి సమీపానికి వచ్చేశారిద్దరు. తల తిప్పివచ్చిన దిక్కుకేసి చూశాడు పురుషోత్తం. తేలి వడుకు దూరమైపోతోంది తెప్ప. కుర్రాడు ఇంకా అక్కడే నిలబడి వున్నాడు, చూస్తూ. ఎక్కడో కలుక్కుమంది.

ఇరుకు సందు. ఆ పేటంతా ఒక పాయిఖానాలా వుండేది. పెంకులూ. దూళి రాలుతున్న ఇల్లు. పెచ్చులూడిపోయిన తులసి కోట చుట్టూ తిరిగే అతుకుల చీర అమ్మ—రోగిష్టి నాన్న. కొనుక్కు తినడానికి డబ్బులుండేవి కావు. ఒక దీపావళికి- తక్కువ చిరుగులున్న చొక్కాలాగూ ఆ వేసి అమ్మ అట్టే పెట్టింది. ప్లీడరు మామయ్య (నాన్న స్నేహితుడు) అన్నయ్యను, తనను తీసుకెళ్ళి బట్టలు కొనిచ్చి ఇంటికి తేవడం స్ఫుటంగా గుర్తుంది. ఆ రాత్రి ఎలా మరిచిపోగలడు. నాన్నకు వీపుకు దిగువున పెద్ద గాయం, చాలాకాలం నించి తీసుకుంటున్న పక్షవాతంతోపాటు. దీపంబుడ్డి కాంతిలో మంచంమీదినించి దించి ఈతాకు చాపమీద పడుకోబెట్టారు. అపుడు రక్తం మరీ ఎక్కువగాకారి నేలలో ఇంకిపోయింది. ఆతొమ్మిదేళ్ళ వయసులో దిక్కు తోచలేదు. ఎంతో భయం వేసింది. తమ ముగ్గురి బతుకులు ఆ రోజుతోసరి. తమను చూడ్డాని కెవరూ లోకంలో లేరు. ఆకలితో చనిపోవలసిందే. రాత్రి భోజనం చేయనందున కడుపులో ఆకలి. ఏదో జంతువు లోపలకి దూరి పేగులు కొరుక్కుతింటున్నట్టు. చచ్చిపోవాలని రైలు పట్టాల కేసి పరుగెట్టాడు.

వంటయిపోయింది, ఎప్పుడు కావాలంటే అప్పుడు వడ్డిస్తానంది సీతాలు.

పన్నెండు గంటలప్పుడు భోంచేశారు. వెంటనే పక్కవేశారు. సాయంత్రం నాలుగ్గంటలపుడు మెలకువ వచ్చింది. కొంతసేపు మాట్లాడుకుంటూ, కొంతసేపు


ఆల్ ఇండియా పాప్యులారిటీ పోటీ

(అమ్మకము పెంచుట కొరకు పథకం)

మొత్తం 82

గల నమూనా

| | | | |
|---|---|---|---|
| 19 | 24 | 17 | 22 |
| 28 | 13 | 26 | 15 |
| 21 | 20 | 23 | 18 |
| 14 | 25 | 16 | 27 |

మొదటి బహుమతి: మొత్తం సొల్యూషన్ సరియైనది అయినచో ఒక వెయ్యి నగదు. రెండవ బహుమతి: పై మూడు అడ్డ వరుసలలో సరియైనది అయినచో అయిదు వందలు నగదు. మూడవ బహుమతి: సోని పూవర్ డీలక్స్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టరు 250 లేదా ఎక్కువ ఎంట్రీదారులకు దర: 270/-లో నగం దర.

నిబంధనలు: 1. ఖాళీ కాగితముపై 14 నుండి 29 వరకుగల అంకెలను ఒకేసారి ఉపయోగించి ఎటుకూడినా మొత్తం 86 వచ్చునట్లు వేయాలి. 2. సీల్డు సొల్యూషన్ మా కార్యాలయమువందుంచబడినది. అది ఎమ్. డి. చే స్వయంగా తెరువబడును. 3. ఈ పోటీకి ఎంట్రీ ఫీజు లేనందువల్ల మొదటి మరియు రెండవ బహుమతులు మా సీల్డు సొల్యూషన్ తో సరిపోయినప్పుడు మాత్రమే ఇవ్వబడును. అట్లు లేనియెడల మొదటి, రెండవ బహుమతులుండవు. 4. మూడవ బహుమతి గెలుపొందినవారు పోస్టేజి ప్యాకింగ్, ఇన్సూరెన్సు, లెదర్ కేస్ ఖర్చులు మొదలయినవి చెల్లించాలి. 5. మూడవ బహుమతి గెలుపొందిన వారికి నగదు బహుమతులుండవు. 6. ఒక ఎంట్రీదారుడు ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. 7. వాదేవీలు అలీగఢ్ సివిల్ కోర్టునందు మాత్రమే. 8. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో మాత్రమే పంపాలి.

ముగింపు తేదీ: 24-11-77 ఫలితం: 26-10-77

MAYUR TRADERS (AJW-86) Jaiganj, ALIGARH-.



ఐటెక్స్ - మాట్ ఫినిష్ తిలకము

నాణ్యతను పరిశోధించి వ్యత్యాసమును చూడండి

ఐటెక్సు మాట్ ఫినిష్ (EYETEX MATT FINISH) తిలకము మీ మృదువైన చర్మమునకు సరియైనది. మీ అందమును ద్విగుణీకృతము చేయును. అనేకమైన మంచి రంగులలో, చర్మమునకు హాని కలగని మంచి సువాసన ద్రవ్యములతో చేయబడినది.

అది ఔషధములు మరియు అలంకార వస్తువుల డ్రగ్స్ మరియు కాస్మెటిక్స్ ప్రకారము విజ్ఞాన పూర్వకముగా తయారుచేయబడినది.

ఒక్కొక్క ట్యూబులోను 30% ఎక్కువ తిలకము అదే ధరకు దొరుకుటచే చాల పొదుపైనది.








33 సంవత్సరముల అనుభవము వేరు విధముగ వుండుటకు వీలులేదు.

ARAVIND LABORATORIES MADRAS-600 033



ఇటీవల జలతరంగిణి (నీటి పారుదలశాఖ) రవీంద్రభారతిలో ప్రదర్శించిన "నేను రాముణ్ణి కాదు" నాటికలో ఓ దృశ్యం. ఇందులో సినీ హీరో సుధీర్, కుమారి వసంత శేషగిరిరావు, కృష్ణమూర్తిని చూడవచ్చు.

మౌనంగా, కొంతసేపు చదువుకుంటూ రోజుని గడిపేవారు.

రోజులు మార్పు లేకుండా నెమ్మదిగా దొర్లుతున్నాయి. రోజూ పొద్దున ఉత్తరం దిక్కుకి, సాయంత్రం దక్షిణం వైపు వెళ్ళి వస్తున్నారు. జాలరుల ఇళ్ళ దగ్గర ఉదయం పోట్లాటలు తారసిల్లేవి. రోజూ దేని గురించో ఆ గుడిసెలలో గొడవలవుతుంటాయి. ఒకరోజు ఒకడి పెళ్ళాం ఇంకొకడితో పోయిందని గొడవ. మరో రోజు మరొకడి పెళ్ళాం మరొకడితో పోయిందని గోల. ఒకడి ఇంట్లో ఇంకొకడి దొంగతనాలు. సాయంత్రం పూట వెళితే ఆప్యాయంగా పలకరించుకుంటూ సంతోషంగా వుంటారు. నీతులు మనిషి ఏర్పరచుకున్నవి. రాగద్వేషాలు, స్త్రీ పురుషులలో పరస్పరాకర్షణ, కోరికలు, ఆకలి ప్రకృతిరీత్యా ఏర్పడ్డవి. సమాజాలతో పాటు నీతులు మారవచ్చు. ప్రకృతిరీత్యా మనిషికి సంక్రమించిన అవిమాత్రం శాశ్వతం అనుకుంటుంటాడు పురుషోత్తం.

రోజూ వయసు మళ్ళిన పల్లెవాడిని (దాలయ్య) వాడి కొడుకుని చూస్తుంటారు. రోజూ తినటానికి వాడికేమైనా తెచ్చిస్తుంటుంది దుర్గ. దాలయ్య ఈ ఇద్దర్ని చూడగానే దండం పెడుతుంటాడు. అంతకు ముందు రోజు పడిన చేపల వివరాలు చెబుతుంటాడు. కొడుకు పొద్దున, సాయంత్రం బద్ధుడైన తండ్రి గురించి చూస్తూ విసుక్కుంటుంటే, అతను "పోరా గుంట నా కొడకా" అని కసరడం మామూలే.

రోజూ పొద్దునే దర్శన మిస్తుంది పొగమంచు. సముద్రం కేసి చూస్తూ ఆలోచనలో వుండిపోతారిద్దరూ. మౌనం భరించలేక కొంతసేపు ఏదో ఒకటి మాట్లాడుతుంది దుర్గ.

పదో రోజు తుఫాను ఆరంభమయింది. సాయంకాలం నాలుగ్గంటలప్పుడు నిద్రలేచి చూసేసరికి చీకటిపడి వుంది. గాలి ఆరంభమయింది. ఎవరి గదిలో వాళ్ళు కొంతసేపు గడిపారు. దుర్గకు, పురుషోత్తమానికి పుస్తకాల వల్ల చాలా కాలక్షేపం అవుతోంది. పెట్టె తీసి నాటికల సంపుటి ఒకటి తీశాడు. అందులో రైడర్స్ టు ది సీ చదవాలనిపించింది. సముద్రానికి దగ్గరగా వుండటం వల్లనేమో, జాలరి వాడి కొడుకు గుర్తుకొచ్చాడు. అరగంటలో చదువు పూర్తయింది. చీకటి వల్ల బిగుస్తోంది. ఎంతకాలం వుంటుందో ఈ తుఫాను. రెండు మూడు రోజుల్లో తగ్గిపోతే తను అదృష్టవంతుడే. జరగాల్సింది జరక్కమానదని మనసును ఊరుకోబెట్టడం ఎంత కష్టం. జరిగే సంఘటన తర్వాత పరిస్థితిని ఊహించలేడు. గుండె బద్దలయిపోతుంది. జీవితాంతం దుఃఖంలో మునిగి తేలాల్సిందే అనిపిస్తుంది. ఆ క్షణాలు సమీపించేసరికి తన జీవితం ఆఖరయిపోవచ్చు.

వర్షం ఆరంభమయింది. సీతాలు వంట వండి, పెడిసీళ్ళ పెట్టి వెళ్ళిపోయింది స్నానానికి.

ఎనిమిది గంటలప్పుడు భోజనాలు చేస్తున్నారు. చాలా చలిగా వుంది, పవిట కొంగు భుజం మీదినించి కొంగు కప్పుకుని వడ్డిస్తోంది దుర్గ. ఎర్రటి గాజులు గలగలమంటున్నాయి. లైట్లు డిమ్ముగావున్నాయి.

వింత జంతువులు వికృతంగా అరుస్తున్నట్లు గాలిహోరు. ఏదో రేకు మీద వర్షం చేసే చప్పుడు. చీకటివల్ల సముద్రం అగుపించటం లేదు. సముద్రం కంబళి కప్పుకున్నట్లు చీకటి.

పది రోజుల ఒంటరితనం ఒక ఎత్తు, ఈ రోజు ఒక ఎత్తు. ఆమె హాయిగా భోంచేస్తోంది. దిగులూ చింతా అగుపించడం లేదు ఆమెలో అతనికి. ఈర్ష్యగా చూస్తుండిపోయాడు. కొన్ని క్షణాలు. బాధంతా తనదేనా, ఆమెకేమీ పట్టదా.

"ఏం ఆగిపోయారు సయించడంలేదా."

"నువ్ అంటున్నావుకదా, కానీ నా సంగతెందుకు."

(5000/- ఆకర్షణీయమైన బహుమతి గెలవండి.)

దీపావళి బంపర్ ఆఫర్ — ఎంట్రీ ఫీజు లేదు.

బహుమతులు : వాచ్, కెమేరా, టేప్‌రికార్డర్, రికార్డ్ ప్లేయర్, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్‌లలో ఒక బహుమతి. కన్సొలేషన్ బహుమతి : అమెరికన్ డిజైన్ చీర ధర రు. 120/-లో సగం రు. 60/-. మొదటి బహుమతి ఇతర వాటితో పేరుగావున్న దానికి ఇవ్వబడును. అదేవిధంగా వున్నదానికి కన్సొలేషను బహుమతి ఇవ్వబడును. ఇది అమ్మకం అభివృద్ధి పథకం. ప్రమోటర్ల తీర్మానం ఖాయమైనది మరియు చట్టబద్ధమైనది.

| | | | |
|---|---|---|---|
| 10 | 15 | 8 | 13 |
| 19 | 4 | 17 | 6 |
| 12 | 11 | 14 | 9 |
| 5 | 16 | 7 | 18 |

నిబంధనలు : తెల్లకాగితముపై పదహారు గదులను నమూనాలో వున్నవిధంగా తయారుచేసి 5 నుండి 20 వరకుగల అంకెలను ఒకసారి మాత్రమే వాడి మొత్తం 50 రావలయును. 2. బహుమతి గెలిచిన వారికి పోస్టేజి, ప్యాకింగ్ మొదలగు ఫీజులు చెల్లించుటకు తెలియపర్చబడును. 3. ఒక కుటుంబం ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. మా కార్యాలయమునకు మొదటగా చేరిన ఎంట్రీకి స్పెషల్ బహుమానముగా 48 పతిగా రు. 101/- నగదు ఇవ్వబడును. 5. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో మాత్రమే పంపాలి.

ఆఖరి పోస్టింగ్ తేదీ : 26-11-77

ATLAS TEXTILES (AJW-50) P. B. No. 95, ALIGARH-202001.

"అదేంటండి ఆ మాట. మీ వంట్లో బాగుంటంలేదా. సరిగా భోంచెయ్యడం మానేశారు."

"నా బాధతో నీకు పనేంటి కానీయ్."

అన్నం ముందునించి లేచిపొయ్యాడు. అకారణంగా కోపం. కారణాలున్నాయి. వాటికి స్పష్టతలేదు. తుండుగుడ్డతో చేయి తుడుచుకుని వెళ్ళిపోయాడు. కిటికీ దగ్గర నిలబడాడు గిన్నెలు సర్దుతోంది ఆమె. బయటి చీకటి లోపలకి వచ్చి వున్న కొద్ది వెలుతురు తినేసేట్లుంది. వందమంది మధ్యన వున్నా మనిషి ఒంటరే. అసలు




అమృతాంజన్
శక్తివంతమయిన
బాధానివారిణి




అనోలియమ్
జలుబుకి
సున్నితమయిన
మందు




అమృతాంజన్
శక్తివంతమయినది. తల నొప్పులు, వెన్ను నొప్పులు, కండరాల నొప్పులు, బెణుకులు మరియు జలుబుల నుంచి శీఘ్రంగా ఉపశమనం కలిగించడానికి దానిలో పది శ్రేష్ఠమైన ఔషధాలు వున్నాయి.

అనోలియమ్ జలుబులని, దగ్గులని పారద్రోలుతుంది. మృదువయిన చర్మాలకోసము అది ప్రత్యేకంగా తయారుచేయబడింది. మీ ఇంట్లో వాటిని ఎప్పుడూ అందుబాటులో వుంచుకోండి.

అమృతాంజన్ మరియు అనోలియమ్ — ఇంటింటా అవసరమయిన నమ్మకమయిన దివ్య ఔషధములు.

అమృతాంజన్ లిమిటెడ్.
80 సంవత్సరాలకు పైగా నమ్మకమయిన గృహ ఔషధములను తయారుచేస్తున్నవారు.

ఎంతమంది మధ్యవుంటె అంత ఒంటరితనం అనుభవిస్తాడేమో.

"నే నేమైనా నొప్పించేట్లు ప్రవర్తించి వుంటే క్షమించండి." కొద్దిగా వులిక్కిపడ్డాడు తన వెనకనే నిలబడ్డ దుర్గను గమనించక. అక్కున చేర్చుకుని నీ వల్ల తప్పేంలేదు, అంతా నాదే అని చెప్పాలని వుంది.

భోజనాల గదినించి వరండాలోకి వచ్చారు. వరండాలోకి గుమ్మాలతో అటొకటి, ఇటొకటి గదులు.

చెరొక గదిలో పడక ఈ పదిరోజులుగా. పది రోజులేమిటి గత రెండు నెలలుగా. కుడివైపున వున్న తన గదిలోకి వెళ్ళబొయ్యాడు. ఎడమ చెయ్యి పట్టుకుని తన గదివైపు లాగింది దుర్గ. చెయ్యి వదిలించుకోడానికి ప్రయత్నించాడు నెమ్మదిగా. వదలలేదు. అశక్తుడిలా ఆమె గదిలోకి వెళ్ళాడు. వరండాలో ఏ దంతెల సందునో వున్న పక్షేదో రెక్కలు చప్పుడు చేసింది. ఇంటిముందున్న చెట్ల ఆకుల చప్పుడు పేలవంగా గాలిని ప్రతిమిలాడుతున్నట్లు. కరెంటు పోయింది. గది మధ్యన వున్నారిద్దరూ. దుర్గ రెండు చేతులు అతని వీపును చుట్టేశాయి. వణుకుతోంది శరీరం. చీకట్లో నల్లటి దుర్గ కనిపించటంలేదు. ముక్కుపుడక కనిపిస్తోంది లీలగా నలుపు రంగు ఎంత అందమయిందో దుర్గని చూసే దాకా తెలీదు పురుషోత్తమానికి. చెంపకు ఆమె ఊపిరి వేడిగా తగులుతోంది. కేవలం పల్చటి చీర మాత్రం వున్న ఆమె అవయవాలు మెత్తగా తగులుతున్నాయి. శరీరాన్ని విదిలించుకోవా లనుకుంటున్నాడు. కాని అశక్తత- యుగాలనాటి అశక్తత. యుగాలయినట్లుంది ఇద్దరి శరీరాలు కలిసి. తన కోరికకు పట్టి వుంచిన కళ్ళెన్ని ఆమె లాగివేస్తూంది. ఏదో గొణిగాడు. మంచం మీద వాలిపొయ్యా రిద్దరు. వర్షం చప్పుడు ఎక్కువవుతోంది. తుఫానుగాలి గింగెర్లెత్తుతోంది. చలి కొరుక్కు తింటోంది.

ఆ రోజు పట్టుకున్న తుఫాను రెండు రోజులకి గాని తగ్గలేదు. మూడో రోజు ఎండ ఫెళ్ళున కాస్తోంది. జాలరిపేట కేసి నడిచారు. పట్టున జనం గుమిగూడి వున్నారు. అందరివీ నగ్న శరీరాలు, గోచీలు తప్ప ఏమీ లేవు శరీరాల మీద. ...ంపులోకి దూరాడు పురుషోత్తం. సగం తినివేయబడ్డ శరీరం. ఏ సొరచేపో కొరుక్కు తినేసింది. మిగిలిన చేతి వేలికి మెరుస్తూ ఎర్రటి రాగి వుంగరం- దాలయ్యది.

నాలుగయిదు రోజుల్రకితం పురుషోత్తం ఒక ప్రశ్న వేశాడు దాలయ్యకి. ఆ ప్రశ్న వేసిన తర్వాత తనకే అది చాలా తెలివి తక్కువదిగా ధ్వనించింది.

"భయం లేదయ్యా మీకు తుఫానులని, సొరలని అలలని, వీటినేమీ లెక్కచెయ్యకుండా "అంతేసి" దూరాలు పోతారు ఈ తెప్పలమీద."

"బియమయితే ఎలా బాబు? పెమాదాలు, బియాలు, ఏడుపులూ పెట్టుకుంటే బితకడమెట్టా?"

అటువైపు వెళ్ళడం మానేశారిద్దరూ.

వచ్చి ఇరవై రోజులు గడిచిపొయ్యాయి. ఇరవై వకటో రోజు -

సాయంకాలం అయిదు గంటలయినా మంచం మీదినించి లేవలేదు దుర్గ. ఒక అరగంటసేపు చూశాడు.

ఆమె గదిలోకి వెళ్ళి చూస్తే తలనిండా ముసుగేసుకుని పడుకుని వుంది. గుండె దడదడ లాడింది. దుప్పటి మొహంమీదినించి లాగాడు. గుండెలమీద చేయివేసి చూస్తే సలసలా శరీరం కాలిపోతోంది. ఆమె అతని చేతిని తనచేత్తో పట్టుకుని అలాగే వుంచుకుంది. ఆమె పక్కనే మంచంమీద కూర్చున్నాడు. ఆమె గుండెదడ చేతికి తగులుతోంది.

"మాత్రలు తెస్తానుండు."

"వద్దు. క్షణంకూడా వదిలి వుండొద్దు" గొణిగింది.

అతని చెయ్యి సన్నగా వణుకుతోంది. గుండెల మీద నించి తన చేయి తీసేయాలని వుంది. లేకపోతే తన వణుకు తెలిసిపోతుంది దుర్గకు. అతని చేతిని గట్టిగా పట్టుకుని వుంది. అవతలనించి ఎవరో తనను లాగుతున్నట్లు, ఇష్టం లేక అతని చేతిని ఆధారంగా చేసుకుని దాన్ని ప్రతిఘటించదలచుకున్నట్లు.

"నా మాట విని మాత్రలు తేనీ-చెయ్యి వదులు."

"వచ్చేశాం రాక తప్పని చోటికి. మన దార్లు చీలిపొయ్యాయి. అనవసరంగా శ్రమ పడకండి."

చేయి పట్టు నిడిపించుకుని వెళ్ళి మాత్రలు తెచ్చి వేశాడు. మరో గంటకు ఆమె ఉఛ్వాస నిశ్వాసాల చప్పుడు ఆగిపోయింది. ఒంటిమీద చేయివేసి చూస్తే శీతలంగావుంది ఆమె శరీరం. ఇక తను వచ్చినపని అయిపోయింది. ఇన్నాళ్ళు పాల పొంగులా వస్తున్న దుఃఖం లేదు ఇప్పుడు. జీవిత ప్రవంతిలో ఎలాంటి ఒడుదుడుకు వున్నట్లనిపించడంలేదు. మంచులాంటి దుర్గ శరీరాన్ని నిలువెల్ల నిమిరి, వెల్లకిలావుంచి తల మీదుగా దుప్పటి లాగి వరండాలోకి వచ్చాడు. వచ్చిన పనయిపోయింది. సముద్రం ఘోష పెడుతూనే వుంది. చల్లటి గాలి వీచి చెమట పట్టిన తన శరీరానికి తగిలింది. ★


వధువు కావలెను

కేంద్ర ప్రభుత్వంలో ఇన్స్పెక్టర్‌గా నెలకు వెయ్యి రూపాయలు సంపాదించు అందమైన 27 సం॥ హిందూ రాజు (ఎత్తు 165 సె.మీ) యువకునకు, తెలుగు లేక హిందీలో ఉన్నత విద్యార్హత కలిగిన సాహిత్యాభిరుచిగల రాజు వధువు కావలెను.

చిరునామా : Box No : 1125, C/o 'ఆంధ్రజ్యోతి' విజయవాడ-10.

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం 'డాగ్ వినాశక్' వాడిన మొదల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మం వలె నుండిపోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Ho : Kalpana Chikitsalaya, Post. Katri sarai (Gaya) 805

డా॥ పి.వి.కె.రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్-వైద్యాచార్య, హస్త ప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట శీఘ్రస్ఖలనము-శుక్ల నష్టము. సుఖరోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స, పోస్టుద్వారాకూడా చికిత్సగలదు.

రావూస్ క్లినిక్,

బి. బి. రోడ్, తెనాలి. ఫోన్ 100.

SUVARNA